


# కెరటం న్యూస్

(సామ్యవాది ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 283 | సోమవారం 10 నవంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## టీవీ రంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటోంది

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక హామీ



## కాలేజీల బంద్ పై మరోసారి సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



## హైదరాబాద్‌లో ఉగ్రవాది అరెస్ట్.. ఇంట్లో భారీగా ఆయుధాలు



## మెదక్ జిల్లాలో దారుణం..

భర్త డబ్బుల కోసం రెండు నెలల చిన్నారిని ట్రాక్టర్ కింద విసిరేసిన తల్లి



## హాస్టల్ బాత్‌రూంలో రహస్య కెమెరాల వ్యవహారం కలకలం



## ఇక నెక్స్ట్ ఖైరతాబాద్ బై ఎలక్షన్!..

పీజేఆర్ కూతురు సంచలన వ్యాఖ్యలు



## 'వృద్ధులకు రూ.4 వేలు, మహిళలకు రూ.2500 త్వరలోనే పథకాలు అమలు'



**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన కీలక హామీలైన వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం పథకాల అమలుపై త్వరలోనే ముహూర్తం ఖరారవుతుందని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ హామీల అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే తీవ్రంగా ఆలోచన చేస్తున్నారని, త్వరలోనే ఈ పథకాలు అమల్లోకి వస్తాయని ఆయన శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

సోషల్ మీడియాలో ఈ హామీల అమలు గురించి ప్రజలు అడుగుతున్నారని, కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి బడ్జెట్ సమకూర్చుకునే కార్యక్రమంలో ఉన్నారనే దాంట్లో ఎలాంటి అనుమానం లేదని జగ్గారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఒక్కో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నామని.. 'ఏదీ చెయ్యలేదు' అని అనడానికి లేదని ఆయన అన్నారు.

## 'నా కొడుకు మరణంపై అనుమానాలున్నాయి'..

### పోలీసులకు ఫిర్యాదు చేసిన మాగంటి గోపీనాథ్ తల్లి..



**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు అయిన మాగంటి గోపీనాథ్ గుండెపోటుతో మరణించినప్పటికీ.. ఈ మరణం చుట్టూ అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోపీనాథ్ మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆయన కుటుంబ సభ్యులు బహిరంగంగా ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. తాజాగా ఈ అంశం పోలీసు ఫిర్యాదు వరకు వెళ్లడం సంచలనం సృష్టించింది. మాగంటి గోపీనాథ్ మృతికి సంబంధించిన నిజానిజాలు తెలియజేయాలని డిమాండ్ చేస్తూ.. ఆయన తల్లి మాగంటి మహానంద కుమారి (92) తన కుమారుడితో కలిసి రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. తన కొడుకును కేర్ తీసుకోవాల్సిన వ్యక్తుల నిర్లక్ష్యంపై పూర్తి విచారణ జరపాలని మహానంద కుమారి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతి వెనుక నిర్లక్ష్యం, సరిగ్గా చూసుకోకపోవడం, మరేదో ఉద్దేశం ఉన్నట్లు తీవ్రంగా అనుమానిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

# ఈ సారి ఎలక్షన్స్ 2028లో కాదు

## 2029 జూన్‌లో.. ఏపీతో పాటే తెలంగాణలో కూడా

- 2034 వరకూ కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్న విశ్వాసం
- జమిలీ ఎన్నికల ప్రసక్తే లేదు – రేవంత్ రెడ్డి
- '10 ఏళ్లలో 100 ఏళ్ల అభివృద్ధి' లక్ష్యం
- ఐటీ–ఫార్మా రంగాలకు కాంగ్రెస్ పునాది గుర్తింపు
- గత కాంగ్రెస్ పాలనలోనే హైదరాబాద్ గ్లోబల్ హబ్
- కేసీఆర్ లెక్కలు తప్పు – రేవంత్ చమత్కారం

**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రాజకీయాలపై, ముఖ్యంగా రాబోయే ఎన్నికల భవిష్యత్తుపై సంచలన జోస్యం చెప్పారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో మాట్లాడుతూ.. జమిలీ ఎన్నికల ప్రస్తావనను తోసిపుచ్చారు. రేపు జమిలీ ఎన్నికలు వస్తాయన్నారు. తన మాటలను గమనించాలని కోరుతూ.. 2028లో కాకుండా 2029 జూన్ నెలలో సాధారణ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అంటే ఏపీతో పాటే.. తెలంగాణలో కూడా సార్వత్రిక ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. అక్కడితో ఆగకుండా.. 2029 నుంచి మళ్ళీ ఐదు సంవత్సరాలకు ఎన్నికలు జరుగుతాయి.. అంటే 2034 జూన్ వరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.





## తెలంగాణలో చలి పులి పంజా..



**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా వర్షాలు కురవగా.. తాజాగా వాటికి బ్రేక్ పడటంతో ఇప్పుడు వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్రంపై చలి పంజా విసరడం ప్రారంభించింది.

## అద్దె పేరుతో దిగి.. గోడకు కన్నం వేసి



**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో దొంగల ముఠా మరోసారి రెచ్చిపోయింది. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత పకడ్బందీగా ప్రణాళిక వేసి.. ఓ నగల దుకాణం గోడకు కన్నం వేసి ఏకంగా 15 కిలోల విలువైన వెండి ఆభరణాలు, సామగ్రిని ఆగంతకులు దోచుకెళ్లారు. అద్దె పేరుతో పక్క దుకాణంలో దిగి ఆ తర్వాత పకడ్బందీగా చేసిన భారీ చోరీ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

## రాముడి వారసులు కావాలా? ఔరంగజేబు వారుసులు కావాలా?

### జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోండి: బండి సంజయ్

**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎన్నికల్లో రాముడి వారసులుగా మేము వస్తుంటే ఔరంగజేబు వారసులుగా కాంగ్రెస్ పార్టీ వాళ్లు వస్తున్నారని.. రాముడి వారసులు కావాలా? ఔరంగజేబు వారసులు కావాలా జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ బైపోల్?లో శ్రీరాముడి దమ్మేంటో, హిందూ ఓటు బ్యాంకు దమ్మేంటో చూపించాలని హాట్ కామెంట్స్ చేశారు. ఇవాళ జూబ్లీహిల్స్ ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింల గురించి ఓ వైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ మాట్లాడుతుంటే హిందువులంతా చేతులు కట్టుకుని కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికలో గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్?లు కేవలం ముస్లింఓటర్లకే డబ్బులు పంచుతూ కనీసం హిందువుల ఇండ్లకు వెళ్లి కనీసం వారి బాధలు కూడా వినడం లేదని ఆరోపించారు. బీజేపీ అంటే హిందూ, హిందూ అంటే బీజేపీ అని మరోసారి బల్లగుద్ది చెబుతున్నామన్నారు.



**సునీత, కేటీఆర్ కుట్ర:**

మాగంటి గోపీనాథ్ ఆస్తులపై సునీత, కేటీఆర్ కుట్ర చేస్తున్నారని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ తాను అమెరికా నుంచి రావొద్దని బెదిరించారని మాగంటి గోపీనాథ్ మొదటి భార్య కుమారుడి ఆరోపించారని అన్నారు. మాగంటి సునీతకు హైదర్ గూడలో మనోహర్ అనే భర్త పేరుతో ఓ ఓటర్ కార్డు ఉందని అలా ఉండగా జూబ్లీహిల్స్ లో తాజాగా దివంగత మాగంటి గోపీనాథ్ భార్యను అంటూ మరో ఐడీ కార్డు తీసుకున్నారని ఆరోపించారు. ఈ మనోహర్ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. ఇవన్నీ తెలిసి కూడా రేవంత్ రెడ్డి ఎందుకు గోపీనాథ్ మరణం, ఆస్తులపై విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో తన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు పింపించానని చెప్పాం

## ఫ్రీ లోన్‌లతో మహిళలకు వ్యాపారాలు పెట్టిస్తాం..

### మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలం మరింతగా పెరుగుతోంది. తాజాగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు స్థానిక నేతలను మంత్రి సీతక్క పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క ముఖ్య వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రజల పక్షం అని ఇతర పార్టీలు మతాలు, కులాలు, ప్రాంతాల పేరుతో రాజకీయాలు చేస్తుంటే, కాంగ్రెస్ అజెండా మాత్రం అభివృద్ధి మాత్రమే అని సీతక్క స్పష్టం చేశారు.

# మెదక్ జిల్లాలో దారుణం

## భర్త డబ్బుల కోసం రెండు నెలల చిన్నారిని ట్రాక్టర్ కింద విసిరేసిన తల్లి

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్): బిడ్డలకు చిన్న దెబ్బ తగిలితేనే కన్న పేగు తల్లడిల్లుతుంది. కానీ భర్తపై కోపంతో ఓ తల్లి దారుణానికి పాల్పడింది. రెండు నెలల చిన్నారిని ట్రాక్టర్ టైర్ల కిందకు విసిరేసి హతం చేయాలని చూసింది. ఈ దారుణ ఘటన మెదక్ జిల్లా ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. భర్త స్వామి గ్రామంలో చెత్త సేకరణ పనికి వెళ్తున్నాడు. అయితే పని చేసిన డబ్బులు ఇవ్వాలని భర్తతో భార్య గొడవ పడింది. అధికారులు ఇంకా డబ్బులు ఇవ్వలేదని భార్యకు చెప్పడంతో కోపంతో రగిలిపోయిన భార్య.. చెత్త ట్రాక్టర్ టైర్ల కిందకు తన రెండు నెలల చిన్నారని విసిరేసింది. దీంతో టైర్ల కింద పడ్డ చిన్నారిని స్థానికులు గమనించి రక్షించారు.

# హాస్టల్ బాత్‌రూంలో రహస్య కెమెరాల వ్యవహారం కలకలం

**న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** తమిళనాడు హోసూరు లోని లేడీస్ హాస్టల్‌లో రహస్య కెమెరాల కేసు దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్థానిక టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ మహిళా సిబ్బంది నివసించే హాస్టల్‌లో రహస్య కెమెరా అంశం సంచలనం రేకెత్తించిన సంగతి తెలిసిందే. వేలాది మంది మహిళలు, యువతులు హాస్టల్ ముందు ధర్నాకు దిగడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది.

ఈ ఉదంతం వివరాల్లోకి వెళ్తే.. టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ తమ సంస్థలో పనిచేసే మహిళా కార్మికుల కోసం హోసూరులో 11 అంతస్తులతో కూడిన 8 భవనాలు నిర్మించింది. ఘటన జరిగిన హాస్టల్లో రెండు వేలకు పైగా మహిళా కార్మికులు బస చేస్తున్నారు. ఒక్కో గదిలో నలుగురు ఉంటున్నారు.

4వ బ్లాక్, 8వ అంతస్తులో ఉండే, మహారాష్ట్రకు చెందిన యువతి అనామికకు బాత్‌రూం లో రహస్య కెమెరా కనిపించింది. దీంతో కంగారుపడ్డ ఆమె... వెంటనే అదే గదిలో ఉంటున్న ఒడిశాకు చెందిన నీలా కుమారి గుప్తాకు తెలిపింది. వెంటనే నీలా బాత్‌రూం దగ్గరకు వెళ్లి కెమెరాను లాగి కిందకు పడేసింది. అయితే, నిజానికి నీలాకుమారినే ఆ కెమెరాను రహస్యంగా ఏర్పాటు చేసింది.

కెమెరా పసిగట్టిన అనామిక హాస్టల్ వార్డెన్ సరితకు విషయం చెప్పగా తాను చూసుకొంటానని, బయట ఎవరికీ చెప్పవద్దని సూచించింది. ఈ ఘటనతో ఆవేశానికి గురైన తోటి మహిళా కార్మికులు ఏకమై ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా ఎస్పీ తంగదురై, ఉద్దనపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి అసలు విషయం బయటపెట్టారు.

నీలా.. తన ప్రియుడైన పంజాబ్‌కి చెందిన రవిప్రతాప్‌సింగ్ తో జల్సా జీవితం అనుభవించేందుకు సదరు వీడియో ఫుటేజ్ ఒక మార్గమని భావించి ఈ ప్లాన్ చేసినట్టు తెలిసింది. ఆయా వీడియోలు అమ్మడమే కాకుండా, వీడియోల్లో ఉన్న మహిళల ఫోన్ నెంబర్లు కూడా ఇస్తానని ఆయా యువతుల్ని బెదిరించి డబ్బు సంపాదించవచ్చని కూడా ప్రియుడితో చెప్పి, నీలా ఈ పనికి ఉపక్రమించింది. దీంతో జిల్లా పోలీసులు ఢిల్లీ నిజాముద్దీన్ రైల్వేస్టేషన్ సమీపంలో నీలా ప్రియుడి మొబైల్ ఫోన్ సిగ్నల్‌ను గుర్తించి అరెస్ట్ చేసి ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు.

# ‘ఈ సారి ఎలక్షన్స్ 2028లో కాదు

## 2029 జూన్‌లో’.. ఏపీతో పాటే తెలంగాణలో కూడా

మొదటి పేజీ తరువాయి

ప్రజలు గతంలో టీడీపీకి, కాంగ్రెస్‌కి, చంద్రశేఖర్ రావుకి చెరో 10 సంవత్సరాలు అధికారాన్ని ఇచ్చారని.. అదే విధంగా మళ్లీ పదేళ్లు మాకే అధికారాన్ని ఇస్తారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ పదేళ్ల కాలంలో 100 సంవత్సరాలకు కావాల్సిన అభివృద్ధిని, ప్రణాళికల్ని రచిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవలంభించిన విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. ఐటీ, ఫార్మా రంగాలకు వారి హయాంలో విశేష ప్రాధాన్యం లభించిందని గుర్తుచేశారు. ఐటీ రంగానికి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వేసిన పునాది నేటి హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి మౌలిక వసతులు నగరానికి జీవనాడిలా మారాయని వివరించారు.

కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తీసుకున్న ముందస్తు నిర్ణయాల కారణంగానే హైదరాబాద్ నగరం ‘నాలెడ్జ్ సిటీ’గా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. 2004-2014 మధ్య అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండడం వల్ల దేశానికి వచ్చిన కేంద్ర సంస్థల్లో 70 శాతం హైదరాబాద్‌కే వచ్చాయని తెలిపారు. నేడు జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా ఎదగడానికి ఆ నాటి కాంగ్రెస్ నిర్ణయాలే కారణమని స్పష్టం చేశారు.

మాజీ సీఎం కేసీఆర్ సీఎం రేవంత్ రెడ్డి పాలనా కాలాన్ని 500 రోజులు అని అంటున్న విషయాన్ని ప్రస్తావిస్తూ వ్యంగ్యంగా మాట్లాడారు. 2025 డిసెంబర్ వస్తేనే రెండేళ్లు అవుతుందని.. ఆ లెక్కన సుమారు 1000 రోజుల పైనే తమ పాలన ఉంటుందని చెప్పారు. ‘ఆయన లెక్కలు ఎలా వేస్తున్నారో, అమెరికా-ఇండియా కాలిక్యులేషన్స్ ఏమైనా వాడుతున్నారో, లేకపోతే మేలుకొని ఉన్నప్పుడే లెక్కలు పెట్టుకుంటున్నారో నాకు తెలియదు’ అంటూ చమత్కరించారు.

2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధిని ఆపకుండా.. దాని కొనసాగింపే.. 2024 నుంచి 2034 వరకు ఉంటుందని ఆయన చెప్పారు. ఈ మాటల ద్వారా తమ ప్రభుత్వం గత ప్రభుత్వాల మంచిని తీసుకుంటూ.. దూరదృష్టితో పాలన అందిస్తుందని ప్రజలకు సందేశం ఇచ్చారు.

# ఇక నెక్స్ట్ ఖైరతాబాద్ బై ఎలక్షన్!..

## పీజేఆర్ కూతురు సంచలన వ్యాఖ్యలు



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్): తెలంగాణ రాజకీయాలు జూబ్లీహిల్స్ బై పోలు చుట్టూ తిరుకుతున్నాయి. ఈ సెగ్మెంట్ లో విజయం సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే జూబ్లీహిల్స్ తర్వాత రాష్ట్రంలో ఖైరతాబాద్ కు ఉప ఎన్నిక రాబోతోందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్న వేళ పీజేఆర్ కూతురు, కాంగ్రెస్ నేత విజయరెడ్డి కీలక ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ యూట్యూబ్ చానల్ తో విజయరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా నెక్స్ట్ ఖైరతాబాద్ కు ఉప ఎన్నిక రాబోతోందని అక్కడ మీరే బరిలోకి దిగి విజయం సాధించబోతున్నారా అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ గెలవబోతోందని అన్నారు. పీజేఆర్ మార్క్ ప్రతి చోట ఉందని తాము కూడా పీజేఆర్ వారసులమనే కాకుండా ప్రజలతో మమేకం అవుతూ వారితో ఉంటున్నామన్నారు. గత ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి తనకు అవకాశం ఇచ్చారని అప్పటి పరిస్థితులు వేరు ఇప్పుడు పరిస్థితులు వేరని చెప్పారు. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు.

జూబ్లీహిల్స్ ఫలితంతో ఖైరతాబాద్ డిసిషన్?:

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఆ తర్వాత కాంగ్రెస్ గూటికి చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో దానం కాంగ్రెస్ బీ ఫామ్ తో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో టెక్నికల్?గా దానంపై శాసనసభా స్పీకర్ చర్యలు తీసుకోవడం ఖాయం అనే చర్చ జరుగుతోంది. విషయం చర్యల వరకు వెళ్లేకంటే ముందే దానం తనంతట తానే రాజీనామా చేసే విషయంలో తన సన్నిహితులతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. జూబ్లీహిల్స్ బై పోల్ లో ఫలితం ఆధారంగా ఖైరతాబాద్ సెగ్మెంట్ లో పాలిటిక్స్ ఉండబోతున్నాయనే చర్చ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో విజయరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.

# ‘వృద్ధులకు రూ.4 వేలు, మహిళలకు రూ.2500 త్వరలోనే పథకాలు అమలు’

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, రాష్ట్ర బడ్జెట్ గురించి అందరికీ తెలుసని పేర్కొంటూ.. ప్రజలు కొంత ఓపిక పట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి ఇంకా మూడేళ్ల సమయం ఉందని మిగిలిన హామీలను కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జగ్గారెడ్డి.. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిస్తేనే ముఖ్యమంత్రి ద్వారా నిధులు తెచ్చి పనులు చేయించడం సులభమవుతుందని ఆయన వివరించారు. నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్‌లోనే పుట్టి పెరిగారని, శక్తి, యుక్తి కలిగిన నాయకుడని జగ్గారెడ్డి కొనియాడారు.

ప్రజలు ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, ప్రతిపక్ష నేత గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధికి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని హెచ్చరించారు. నవీన్ యాదవ్ ను గెలిపిస్తే జూబ్లీహిల్స్ అభివృద్ధికి తాను కూడా పూర్తి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న నిధులు ఇప్పించే బాధ్యత తనదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాబోయే ఐదేళ్లు కూడా ప్రజలు కాంగ్రెస్ పార్టీకే అవకాశం ఇస్తారనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# ‘నా కొడుకు మరణంపై అనుమానాలున్నాయి’.. పోలీసులకు ఫిర్యాదు చేసిన మాగంటి గోపీనాథ్ తల్లి..

మొదటి పేజీ తరువాయి

తన కొడుకు ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు.. చివరికి జూన్ 8, 2025న అతడు అధికారికంగా చనిపోయినట్లు ప్రకటించిన తర్వాత కూడా అతన్ని చూడడానికి అనుమతించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఆసుపత్రి భద్రతా సిబ్బంది సునీత కుమార్తె దిశీరా లిఖితపూర్వకంగా ఇచ్చిన ఆదేశాల ప్రకారమే తనను బయటే ఉంచారన్నారు. కానీ..కేటీఆర్ మాత్రం గోపీనాథ్‌ను స్వేచ్ఛగా కలవడానికి అనుమతించారు. ఈ వివక్ష ఏదో కుట్ర లేదా మోసంజరుగుతోందనే తన అనుమానాలను మరింత పెంచిందన్నారు. అంతే కాకుండా.. కేటీఆర్ వచ్చి వెళ్లే వరకు మరణాన్ని ప్రకటించలేదని ఆరోపించారు. “నా కొడుకు మరణాన్ని మిస్టరీగా మార్చారు. ఏం జరిగిందో కేటీఆరే చెప్పాలి” అని ఆమె శనివారం సంచలన వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

అంతే కాకుండా.. కిడ్నీ తొలగించిన తర్వాత వైద్యులు సరిగా పట్టించుకోలేదని.. డయాలసిస్ చేయడంలో ఆలస్యం జరిగిందన్నారు. గోపీనాథ్‌కు నియమించిన గన్‌మెన్‌లు, భద్రతా సిబ్బంది తమ విధులను సరిగా నిర్వర్తించలేదన్నారు. ఈ సిబ్బందికి సీపీఆర్ తో సహా అత్యవసర సహాయం అందించేలా శిక్షణ ఉంటుంది. కానీ, గోపీనాథ్ కుప్పకూలినప్పుడు వారు అక్కడ లేరు లేదా సరిగా స్పందించలేదని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అయిన మాగంటి సునీత తన కొడుకు మరణం వెనుక ఉన్న నిజం దాస్తున్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు.

ఈ ఆరోపణలను ఆధారం చేసుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గోపీనాథ్ మరణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని.. ఆయన కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది నుంచి వాంగ్మూలాలను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఆస్తి వ్యవహారాలకు ముడిపడి ఉందని కూడా ఆయన ఆరోపించారు. ఈ వివాదంపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎవరైనా అధికారికంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఏ తల్లి కూడా తన కొడుకు మరణంపై వివాదం చేయదని, ఫిర్యాదు చేస్తే పోలీసులు తప్పక విచారణ చేస్తారని తెలిపారు.

అధికార పార్టీ, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న ఈ తరుణంలో.. గోపీనాథ్ తల్లి స్వయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం అనేది ఈ మొత్తం వ్యవహారానికి ఒక టర్నింగ్ పాయింట్‌గా మారింది. మరణానికి సంబంధించిన నిజాలు త్వరలోనే బయటకు వస్తాయని, పోలీసు విచారణ పారదర్శకంగా జరగాలని రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారు.

# తెలంగాణలో చలి పులి పంజా..

## పడిపోతున్న ఉష్ణోగ్రతలు, జాగ్రత్తగా ఉండండి

మొదటి పేజీ తరువాయి

శనివారం నుంచే రాష్ట్రంలో చలి ప్రారంభం కాగా.. నవంబర్ 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత మరింత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం వెల్లడించింది. రాబోయే రోజుల్లో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 9 నుంచి 14 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

శనివారం రాత్రి నుంచే ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం ప్రారంభించాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లా బేలలో 14.7 డిగ్రీల సెల్సియస్, రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 14.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జహీరాబాద్‌లో 14.7 డిగ్రీల సెల్సియస్, శంకర్ పల్లి 14.9 డిగ్రీల సెల్సియస్, మొయినాబాద్ 15.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక హైదరాబాద్‌లో రాజేంద్రనగర్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లలో అత్యల్పంగా 15.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. బీహెచ్‌ఈఎల్ 15.5 డిగ్రీల సెల్సియస్ మల్కాజ్‌గిరి 15.7, గచ్చిబౌలి 15.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలను నమోదు అయినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాతావరణ కేంద్రం రాష్ట్రంలోని పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలోని మిగిలిన 23 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 నుంచి 14 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

# అద్దె పేరుతో దిగి.. గోడకు కన్నం వేసి

మొదటి పేజీ తరువాయి

పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. మోతుకూరి సోమేశ్వర్ అనే వ్యక్తి బౌరంపేట కీర్తిహోమ్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన తన ఇంటికి సమీపంలోని పెట్రోల్‌బంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షట్టర్‌ను అద్దెకు తీసుకుని సోమేశ్వర జ్యువెలరీ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8.45 గంటలకు సోమేశ్వర్ దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఆయన వద్ద పనిచేసే అరుణ్ కుమార్ షాపు తెరవడానికి రాగా.. లోపల దృశ్యం చూసి షాక్ అయ్యాడు. దుకాణం లోపలి గోడకు పెద్ద రంధ్రం చేసి ఉంది.

అంతేకాకుండా, షోకేసులలో ఉంచిన సుమారు 15 కిలోల వెండి ఆభరణాలు, ఇతర వెండి వస్తువులు కనిపించకపోవడంతో వెంటనే యజమానికి సమాచారం అందించాడు. కాగా, దొంగలు ఈ చోరీని అత్యంత పకడ్బందీగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. వారి దుకాణానికి పక్కనే ఉన్న పూజా స్టోర్ షట్టర్‌ను వారం రోజుల క్రితమే మూసివేశారు. రెండు రోజుల ముందు.. ఒక అగంతకుడు వచ్చి ఆ పక్క షట్టర్‌ను అద్దెకు తీసుకుంటానని చెప్పి, యజమానికి అడ్వాన్స్‌గా రూ.10 వేలు కూడా ఇచ్చాడు. సరిగ్గా అదే పక్క దుకాణం నుంచి గోడకు కన్నం వేసి, దొంగలు తమ పని కానిచ్చారు. ఈ విధానం చూస్తుంటే.. దొంగల ముఠా ఆ ప్రాంతంలో కనీసం వారం రోజుల ముందే రెక్కీ నిర్వహించి, ఈ దొంగతనానికి పథకం రచించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

దొంగలు ఎంత పకడ్బందీగా వ్యవహరించారంటే.. చోరీ అనంతరం దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల డీవీఆర్, హార్డ్‌డిస్క్‌లను కూడా తమతో తీసుకెళ్లారు. దీంతో దొంగతనానికి సంబంధించిన ఎలాంటి ఫుటేజీ దొరకకుండా జాగ్రత్త పడ్డారు. ఘటన గురించి తెలుసుకున్న వెంటనే మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, డీఐ బాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సాక్ష్యాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆ పక్క షట్టర్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తి కోసం, దుండగుల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు.

# టీవీ రంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటోంది

## టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక హామీ

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్): బేగంపేట టూరిజం ప్లాజా ప్రాంగణంలో తెలంగాణ టెలివిజన్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ కార్మికుల కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. సమ్మేళనంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, సినీ పరిశ్రమకు చెందిన 38 సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖ నటులు, సాంకేతిక నిపుణులు, సినీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అందరిదీ.. సినీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. సినీ పరిశ్రమలో సక్సెస్ రేట్ తక్కువ అని, రాజకీయాలు కూడా అంతేనని, రెండు రంగాలకూ పట్టుదల అవసరం అని కీలక వ్యాఖ్యలు చేశారు.

చదువుకుంటే జీవితం కలర్ టీవీలా మెరిసిపోతుంది.. ప్రభుత్వం టీవీ రంగం అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. జూబ్లీ హిల్స్ అభివృద్ధి చెందాలంటే నవీన్ యాదవ్ గెలవాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్ ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటాడని టికెట్ ఇచ్చిందని తెలిపారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ ఖజానాను కొల్లగొట్టిందని, వాటాల తేడా వల్ల కవిత రోడ్డున పడ్డారని మండిపడ్డారు. టీవీ రంగాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని, సినీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి చెప్పారు.

# కాలేజీల బంద్ పై మరోసారి సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్): ప్రైవేట్ కాజీల బంద్ పై సీఎం రేవంత్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను బెదిరించడానికే కాలేజీలను బంద్ చేశారని అన్నారు. ఆరు నెలల పాటు బంద్ చేస్తే పిల్లల భవిష్యత్ ఏం కావాలని ప్రశ్నించారు. విద్య వ్యాపారం కాదని.. సేవ అని అన్నారు. ఫీజులు ఇస్తారా లేదా అని బంద్ చేయించి బెదిరిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంతాలు, పట్టింపులకు పోతే సమస్య పరిష్కారం కాదన్నారు. రూల్స్ ప్రకారం వెళదామంటే చెప్పండి సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. 100 శాతం రూల్స్ పాటించే కాలేజీలకు తక్షణమే బకాయిలు ఇస్తామని స్పష్టం చేశారు. ఇక ఇటీవల కూడా సీఎం నిరసన చేస్తున్న కాలేజీలకు వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మరుసటి రోజే ఉపముఖ్యమంత్రితో కాలేజీ యాజమాన్యాలు చర్చలు జరపగా సఫలం అయ్యాయి. దాంతో తిరిగి కాలేజీలను ప్రారంభించారు.

# హైదరాబాద్‌లో పెద్ద ఉగ్రవాది అరెస్ట్ ఇంట్లో భారీగా ఆయుధాలు

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (కెరటం న్యూస్): హైదరాబాద్‌లో పెద్ద ఉగ్రవాదిని గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. దేశంలో భారీ ఉగ్రకుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ భగ్నం చేసింది. ఈ మేరకు ఆదివారం ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుంది. వారికి ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్ తో సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన అహ్మద్ మొహియుద్దీన్(35) ఉన్నారు. ఇతను తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని దీని ఆధారంగా, ఆదివారం ఆయన నివాసంలో విస్తృతంగా అధికారులు తనిఖీలు చేశారు. టెలీగ్రామ్ ద్వారా ఐఎస్‌కేపీ సభ్యులతో మొహియుద్దీన్ చర్చలు జరుపుతున్నాడని నిర్ధారించారు. నిందితుడి నుంచి రెండు గ్లాక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 కాట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా.. ఈనెల 18 వరకు రిమాండ్ విధించింది. కాగా, మొహియుద్దీన్ ఫ్రాన్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు గుర్తించారు. విచారణలో మొహియుద్దీన్ ఆయుధాలను రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్ నుండి కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. దర్యాప్తులో కేంద్ర సంస్థలు కూడా పాల్గొన్నాయి.

# రాముడి వారసులు కావాలా? ఔరంగజేబు వారసులు కావాలా? జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోండి

## -బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ పేరు చెప్పి గెలిచిన కేటీఆర్ నా గురించి మాట్లాడుతావా అంటూ బండి సంజయ్ ఫైర్ అయ్యారు. తాను డ్రగ్స్ తీసుకోలేదు అనే విషయాన్ని ఇవాళ సాయంత్రం లోపు తన తల్లిదండ్రులు భార్య పిల్లలతో సహా కుటుంబ సమేతంగా భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో కేటీఆర్ తడిబట్టలతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఈ ప్రమాణం చేయకుంటే కేటీఆర్ నీచుడిలెక్కనన్నారు. డ్రగ్స్ విషయంలో శాంపిల్స్ కోసం వెంట్రుకలు అడిగితే అమెరికా వెళ్లి ట్రీట్మెంట్ తీసుకుని వచ్చాక వెంట్రుకలు ఇస్తానన్న నువ్వా నా గురించి మాట్లాడుతారా అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జుబ్లీహిల్స్ అంటే డ్రగ్స్ అనే పరిస్థితి తీసుకువచ్చిందే కేటీఆర్ అని ఆరోపించారు.

రేవంత్ వ్యాఖ్యలకు కౌంటర్:

తెలంగాణలో 2034 వరకు మాదే అధికారం అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పటికే 2 ఏళ్లు పూర్తయ్యాయి. రాబోయే మూడేళ్లు అధికారంలో ఉండే చాలన్నారు. కాంగ్రెస్ పార్టీని ఎవరో దింపాల్సిన పని లేదని వాళ్లకు వాళ్లే తన్నుకుంటారని సెటైర్లు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని ముఖ్యమంత్రే ఒప్పుకుంటున్నారు. అందుకే ఇక్కడ బీజేపీకి ఓట్లు వేయమని సీఎం చెప్పాలి. మేము గెలిస్తే కిషన్ రెడ్డి, నేను మోడీ వద్దకు వెళ్లి నిధులు తీసుకువస్తామన్నారు. కాంగ్రెస్ అంటే ముస్లిం ముస్లిం అంటే కాంగ్రెస్ అని మొదట సీఎం రేవంత్ రెడ్డే అన్నారు. నేను అప్పటి వరకు హిందుత్వం గురించి మాట్లాడలేదన్నారు. జూబ్లీహిల్స్ లో సర్వేలు మొత్తం తారుమారు కాబోతున్నాయన్నారు.

# ఫ్రీ లోన్‌లతో మహిళలకు వ్యాపారాలు పెట్టిస్తాం.. మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

మూడు సార్లు బీఆర్ఎస్‌కి గెలుపు ఇచ్చినా ప్రాంతంలో అభివృద్ధి జరగలేదని ఆమె విమర్శించారు. ఇప్పుడు స్థానికుడు, పక్కా లోకల్ నాయకుడు నవీన్ యాదవ్‌కి ఒక్క అవకాశం ఇవ్వాలని, ప్రజల సమస్యలు పరిష్కరించే సత్తా ఆయనకుందని మంత్రి పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతున్నాయని సీతక్క తెలిపారు. గత ప్రభుత్వంలో కనీసం రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కానీ మేము రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతి మహిళ మహిళా సంఘంలో చేరాలన్నారు. ఫ్రీ లోన్ ఇచ్చి మీ చేత వ్యాపారాలు పెట్టిస్తామని, ఆర్టీసీలో అద్దె బస్సులను మహిళా సంఘాలకు అప్పగించామని ఆమె వివరించారు. మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించినది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేస్తూ.. ఈ రిజర్వేషన్ల వల్లే ఎంతోమంది మైనార్టీ విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు, ఉద్యోగాలు పొందారు.. అని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కూడా మైనార్టీలకు కోటా కల్పిస్తున్నామని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రజల అండతో నవీన్ యాదవ్‌ను గెలిపించాలని, జూబ్లీహిల్స్ అభివృద్ధికి దోహదపడాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## సిపిఐ (ఎం)ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం



**ఖమ్మం టౌన్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** నగరంలో నెలకొని ఉన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐఎం కంమన్ డివిజన్ కార్యదర్శి వై విక్రం డిమాండ్ చేశారు. స్థానిక 17వ డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ శాఖ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో నీ ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు నగరంలో ని పలు డివిజన్ లలో స్థానిక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని ఆరోపించారు. రోడ్లు దెబ్బతిని ప్రజలు నరకయాతన పడుతున్నారని తెలిపారు అదే విధంగా సైడ్ రైలు శుభ్రం చేయకపోవడం వల్ల కంపు కొడుతున్నాయని పేర్కొన్నారు దీనివల్ల ఆయా డివిజన్లోని ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఖాళీ స్థలాల్లో మొక్కలు పిచ్చి చెట్లు పెరగటం వల్ల దీనిని పట్టించుకునే కరువయ్యాడని విమర్శించారు. రోడ్లపై మోకాళ్ళ లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయని తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని ఇల్లు లేని పేదలకు ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. వెంటనే నగరంలో నెలకొని ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా రంజిత్, చౌదరి, భడే మియా తదితరులు పాల్గొన్నారు.

# జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్




**ఖమ్మం టౌన్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** ఆదివారం ఖమ్మం పట్టణంలో అజీజ్ సందులో గల జమాఅతె ఇస్లామీ హింద్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా అధ్యక్షతన జరిగిన సభ్యుల మరియు కార్యకర్తల సమావేశం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదిక్ అహ్మద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నవంబర్ 21-30 వరకు నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్ (పొరుగు వారి హక్కులు) నిర్వహిస్తుందన్నారు ఈ ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రతి కార్యకర్త పొరుగువారి హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలి. పొరుగువారు ఒకరితో ఒకరు సంబంధాలను చక్కదిద్దుకోవడానికి మరియు స్నేహపూర్వక మరియు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలి, వీధిలో, షాపింగ్ కేంద్రాలలో, ప్రయాణిస్తున్నప్పుడు మరియు వర్చువల్ ప్రపంచంలో పొరుగువారి గురించి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ఉద్యమంలో పురుషులు మరియు మహిళ కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జమాఅతె ఇస్లామి హింద్ నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్,సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్ బి ,సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా సభ్యులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దయచేసి ఫ్రీ బస్ పథకం తీసేయండి..

## సీఎం రేవంత్ రెడ్డికి మన్ననూర్ మహిళల విజ్ఞప్తి



**న్యూస్ డెస్క్ 09 నవంబర్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గొప్పగా ఇచ్చామని చెప్పుకుంటున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దయచేసి ఫ్రీ బస్ పథకాన్ని తీసేయండని మహిళలే రోడ్డెక్కి నిరసనకు దిగారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో కొద్దిరోజులుగా బస్సులు రద్దీగా మారాయి. దీంతో చాలా బస్టాప్‌ల్లో మహిళలు కనిపిస్తే బస్ డ్రైవర్లు ఆపకుండానే వెళ్తున్నారని ఇప్పటికే పలువురు ఆరోపిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో శ్రీశైలం వెళ్లే బస్సులను తమ వద్ద ఆపడం లేదని నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లో మహిళలు ఆందోళనకు దిగారు. బస్సులను ఆపకపోవడంతో రహదారిపై బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. ఒక బస్సు ఎక్కి డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం పథకంతో తమకు మర్యాద లేకుండా పోతుందని ఆవేదన చెందారు. ఎక్కడికైనా వెళ్లాలంటే బస్సులు కూడా ఆపడం లేదని మండిపడ్డారు. దయచేసి ఈ ఫ్రీ బస్ స్కీమ్‌ను ఎత్తివేయండని సీఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు.

# సిపిఐ సీనియర్ సభ్యురాలు సుగుణమ్మ మృతి



**చింతకాని, 09 నవంబర్ (కెరటం న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ (92) ఆదివారం సాయంత్రంనాగులవంచలో తుదిశ్వాస విడిచారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన సుగుణమ్మ భర్త వంకాయలపాటి సీతయ్య సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పనిచేశారు. సుగుణమ్మ రెండు సార్లు ఖమ్మం సమితి సభ్యురాలిగా, నాగులవంచ గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్ గా ఎన్నికయ్యారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ -సభ్యురాలిగా సుగుణమ్మ కొనసాగారు. సుగుణమ్మ జాతీయ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకురాలిగా రెండు దశాబ్దాల కాలం పాటు వివిధ హోదాలలో పని చేశారు. ఆమె కుమారుడు వంకాయలపాటి సత్యనారాయణ సిపిఐ నుంచి నాగులవంచ బి2 ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి -సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ సుగుణమ్మ మృతి పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని వారు తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి సుగుణమ్మ మృతదేహాన్ని సందర్శించి అరుణ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, మండల నాయకులు తాళ్లూరి యాదగిరి, బైరబోయిన హన్మంతరావు, జర్నలిస్టు చావ అరుణ్ కుమార్, ఆదర్శ స్కూల్ కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్, బిఆర్ఎస్ నాయకులు పాపినేని రంగారావు, కొల్లి బాబు, సామినేని బాబురావు, వంకాయలపాటి లచ్చయ్య, అంబటి సైదేశ్వరావు, వెంకటి, పరిటాల లక్ష్మణ స్వామి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సామినేని అప్పారావు , ఆలస్యం రవి, తోటకురి వెంకటనరసయ్య, కందరబోయిన కొండలరావు, మత్కపల్లి మార్కెట్ కమిట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య , బిజెపి నాయకులు కొండా గోపి, మద్దినేని వెంకటేశ్వర్లు , టీడీపీ నాయకులు తేలుకుంట్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# మందుబాబులకు బ్యాడ్‌న్యూస్.. నేటి నుంచి వైన్స్ బంద్




**హైదరాబాద్, 09 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో అధికారులు శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా.. నియోజకవర్గం వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసివేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపఎన్నికకు మంగళవారం (నవంబర్ 11) పోలింగ్ జరగనున్న నేపథ్యంలో.. ఆదివారం (నవంబర్ 9) సాయంత్రం నుంచే మద్యం దుకాణాలను మూసివేశారు. ఈ నిషేధం మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు అమలులో ఉంటుంది.

అంతేకాకుండా.. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉన్నందున.. ఆ రోజు ఉదయం నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలను బంద్ చేయనున్నారు. ఎక్సైజ్ చట్టం 1968, సెక్షన్ 20 ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో వైన్ షాపులు, కల్లు దుకాణాలతో పాటు రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్‌లు, స్టార్ హోటల్స్‌లోని బార్‌లు, రిజిస్టర్డ్ క్లబ్స్‌లోని బార్‌లను కూడా మూసివేశారు.

ఇదిలా ఉండగా.. ఎన్నికల ప్రచారం పర్వం ఆదివారంతో ముగియడంతో అధికారులు భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. దీని ప్రకారం.. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండటం నిషేధం. ఓట్ల లెక్కింపు రోజున రోడ్లు, జనావాసాల్లో టపాసులు కాల్చడం కూడా నిషేధమని అధికారులు హెచ్చరించారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

ఇది ఉపఎన్నిక అయినప్పటికీ.. అన్ని ప్రధాన పార్టీలు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ తరపున నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, బీజేపీ తరపున లంకల దీపక్ రెడ్డి ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ ఎన్నికలో గెలిచి నగరంలో తమ సత్తా నిరూపించుకోవాలని కాంగ్రెస్ చూస్తుంటే.. పూర్వ వైభవాన్ని తిరిగి తెచ్చుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 ఎమ్మెల్యే స్థానాలు గెలిచిన బీజేపీ, ఈ స్థానంలో గెలిచి పార్టీ బలం మరింత పెంచుకోవాలని కసరత్తు చేస్తోంది. ఈ హోరాహోరీ పోరు కారణంగా ఎవరు గెలుస్తారనే దానిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# జేఎన్టీయూలో ర్యాగింగ్ కలకలం..

## ఇద్దరు అబ్బాయిలకు పెళ్లి చేసిన సీనియర్లు



**జగిత్యాల , 09 నవంబర్ (కెరటం న్యూస్):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 'ఇంటరాక్షన్' పేరుతో సీనియర్ విద్యార్థులు జూనియర్లను మానసికంగా వేధించిన ఘటన బయటపడింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఘటనలు ఆగకపోవడంపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. యాంటీ ర్యాగింగ్, ఉమెన్ ప్రొటెక్షన్ కమిటీలు పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు, యాజమాన్యం భద్రతా వ్యవస్థను సమీక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిపుణులు విద్యార్థులు ర్యాగింగ్ చర్యలను తేలికగా తీసుకోకుండా ఆగాలని హెచ్చరిస్తున్నారు. కమిటీలు చట్టపరంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్స్ వినిపిస్తున్నాయి.

తెలంగాణ ఉన్నత విద్యా వ్యవస్థలో ర్యాగింగ్ భూతం మరోసారి తలలు ఎత్తింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి శివారులోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్లపై పాల్పడిన ర్యాగింగ్ తీరు సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా.. ఇద్దరు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పెళ్లి చేసినట్లుగా వివాహ తంతును నిర్వహించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. క్యాంపస్ భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం క్యాంపస్‌లో చోటు చేసుకుంది. బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు అబ్బాయిలను సీనియర్లు చుట్టుముట్టి, వారికి పెళ్లి చేసినట్లుగా వివాహ తంతు నిర్వహించారు. తాళికట్టడం, ఇతర సంప్రదాయాలను అనుకరిస్తూ ఈ తంతును రికార్డు చేశారు.

కొందరు సీనియర్లు ఇది కేవలం 'హెల్తీ కమ్యూనికేషన్ ఇంటరాక్షన్‌లో భాగంగా చేసిందే తప్ప వేధింపులు లేవని సమర్థించుకుంటున్నా.. ఇలాంటి చర్యలు జూనియర్ల మనస్సుపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటన కేవలం సరదాగా మొదలైంది కాదని, మానసిక వేధింపుల దిశగా వెళుతోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ల ఒత్తిడి, బెదిరింపులతో జూనియర్లు భయభ్రాంతులకు గురవుతున్నట్లు సమాచారం. ఈ దారుణ ఘటనతో కళాశాల యాజమాన్యం, భద్రతా లోపాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

క్యాంపస్‌లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఇలాంటి సంఘటనలు ఆగకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులపై పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని వారు విమర్శిస్తున్నారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్, ఉమెన్ ప్రొటెక్షన్ కమిటీలు పేరుకే ఉన్నాయని.. వాటి ద్వారా అవగాహన చర్యలు కనిపించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కమిటీలు చట్టపరంగా అవగాహన కల్పించి.. తమ బాధ్యతను నిర్వర్తించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ నరసింహను సంప్రదించగా.. క్యాంపస్‌లో ర్యాగింగ్ జరగలేదని అన్నారు. ఫన్నీ గేమ్స్ సర్వసాధారణమని.. అయితే ఇలా పెళ్లి చేసి వీడియోలు తీయాల్సింది కాదన్నారు. ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని , ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులు, స్థానికులు ఈ ఘటనను తేలికగా తీసుకోవద్దని యాజమాన్యాన్ని, పోలీసులను కోరుతున్నారు. ఘటన జరిగిన తెల్లారి జగిత్యాల జిల్లా ఎస్పీ పర్యటనకు రావడం.. అయినా ఈ విషయం ఆయన దృష్టికి రాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, యాజమాన్యం కలిసి నిఘా కెమెరాలు, భద్రతా వ్యవస్థను తక్షణమే సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పెట్టిన పెట్టుబడి రాలేదని యువరైతు ఆత్మహత్య



**జమ్మికుంట , 09 నవంబర్ (కెరటం న్యూస్):** పెట్టిన పెట్టుబడి రాలేదని అప్పుల పాలై మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు ఓ యువరైతు. ఈ సంఘటన జమ్మికుంట మండలంలోని నాగంపేట గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన సోమల హరీష్ (28) బీటెక్ చదువుకొని కొన్ని సబ్జెక్టులు ఆగడంతో చదువు మానేసి తన తండ్రితో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడుఈ మధ్యకాలంలో పడిన అకాలవర్షాల కారణంగా వారు వేసిన పత్తి పంట, వరి పంట నేలపాలై పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో అప్పుల పాలైనామని మనస్థాపానికి గురయ్యాడు. శనివారం ఉదయం హరీష్ ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం అయినా కూడా ఇంటికి రాకపోవడంతో తన తండ్రి సదయ్యకు అనుమానం వచ్చి అన్ని చోట్ల వెతుకుతూ ఉండగా పొలం వద్ద తన కొడుకు పురుగుల మందు తాగి పడి ఉన్న హరీష్ ను వెంటనే జమ్మికుంటలోని విజయసాయి హాస్పిటల్ కి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడని, తండ్రి సదయ్య ఫిర్యాదు మేరకు జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం కొట్టిన అనీష్ భన్వాలా



స్పోర్ట్స్ న్యూస్, 09 నవంబర్ (కెరటం న్యూస్): ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈజిప్ట్‌లోని కైరో వేదికగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ అనీష్ భన్వాలా మెరిసిపోయాడు. 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో అద్భుతమైన ప్రదర్శనతో రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. చివరి రౌండ్ వరకు జర్మనీకి చెందిన షూటర్‌తో పోటీ పడి తక్కువ తేడాతో రెండో స్థానంలో నిలిచాడు.

ఈ విజయంతో అంతర్జాతీయ వేదికపై భారత షూటింగ్ ప్రతిష్టను మరింత ఎత్తుకు చేర్చిన అనీష్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. హర్యానాకు చెందిన ఈ యువ షూటర్ గత కొన్ని నెలలుగా అద్భుత ఫామ్‌లో కొనసాగుతూ పలువురు ప్రముఖులను ఆకట్టుకున్నాడు. భారత షూటింగ్ సంఘం అనీష్ ప్రదర్శనను అభినందిస్తూ "దేశానికి మరో గర్వకారణం"గా పేర్కొంది. రాబోయే అంతర్జాతీయ పోటీల్లో కూడా అతను మెరుగైన ఫలితాలు సాధిస్తాడని విశ్వాసం వ్యక్తం చేసింది.

# పాకిస్తాన్ ట్రై సిరీస్ నుంచి వైదొలిగిన అఫ్ఘానిస్తాన్.. అసద్ ఉల్లా ఖాన్ కీలక వ్యాఖ్యలు




స్పోర్ట్స్ న్యూస్, 09 నవంబర్ (కెరటం న్యూస్): అఫ్ఘానిస్తాన్, పాకిస్థాన్ మధ్య ఇటీవల నెలకొన్న యుద్ధ పరిస్థితుల గురించి విషయం తెలిసిందే. అయితే ఈ పరిస్థితుల మధ్య ఇరు దేశాల మధ్య గతంలో షెడ్యూల్ చెయబడిన ట్రై సిరీస్ పై అఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్‌లో జరగాల్సిన ట్రై సిరీస్ నుంచి తాము వైదొలగి నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంపై అఫ్ఘనిస్తాన్ దేశ మాజీ క్రికెటర్, కోచ్, చీఫ్ సెలెక్టర్ అసద్ ఉల్లా ఖాన్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఓ వీడియోలో మాట్లాడుతూ.. "ఏ దేశ గౌరవాన్ని దెబ్బతీయడం సరైన విషయం కాదు. అలాంటి పరిస్థితిని ఏ దేశం అయినా అంగీకరించదు. కాబట్టి అఫ్ఘానిస్తాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం సరైనదే అని తాను భావిస్తున్నానని" చెప్పుకొచ్చాడు.

అలాగే ఆయన భారత క్రికెట్ బోర్డుపై ప్రశంసలు కురిపించాడు. "మేము అఫ్ఘానిస్తాన్ క్రికెట్ బోర్డు తరఫున భారతదేశానికి చెందిన పలు కోచ్‌లను మా జట్టుతో పనిచేయడానికి ఆహ్వానించాం. వాళ్ల స్పందన చాలా సానుకూలంగా ఉంది. నాకు భారత జట్టులో నచ్చే విషయం ఏమిటంటే, వారు తమ దేశీయ కోచ్‌లు అయిన గౌతమ్ గంభీర్, రాహుల్ ద్రావిడ్, గంగూలి వంటి వారిని నియమిస్తారు. ఇది చాలా మంచి నిర్ణయం, బీసీసీఐ తీసుకున్న ఈ అడుగు ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తుంది" అని ఆయన అన్నారు. అఫ్ఘానిస్తాన్ జట్టు ఈ నిర్ణయంతో పాకిస్తాన్‌తో సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అఫ్ఘాన్ బోర్డు మాత్రం దేశ గౌరవం, జట్టు భద్రత ప్రధానమని స్పష్టం చేసింది.

# నన్ను టార్గెట్ చేసి పరువు తీస్తున్నారు.. అనుపమ పరమేశ్వరన్



మూవీ న్యూస్, 09 నవంబర్ (కెరటం న్యూస్): కొంతమంది ఆకతాయిలు సెలబ్రిటీలతు టార్గెట్ చేస్తూ మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. స్టార్ హీరోల కానుంచి హీరోయిన్ల వరకు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇటీవల చిరంజీవి కూడా మార్ఫింగ్ ఫొటోలతో ఇబ్బంది పడ్డారు. తాజాగా, ఇప్పుడు ఓ యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ కు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. అయితే ఇందులో షాకింగ్ ట్విస్ట్ ఒకటి ఉంది. ఇన్నాళ్లు ఇలా చేస్తుంది.. అబ్బాయిలే అని అంతా అనుకున్నారు. కానీ అనుపమ ఫొటోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేసింది మాత్రం ఓ 20 ఏళ్ల అమ్మాయి అని తెలిసి అంతా భయపడిపోతున్నారు.

ఈ విషయాన్ని తెలియజేస్తూ అనుపమ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ నోట్ షేర్ చేసింది. "కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో నా పోస్టులు పెడుతున్నారు. ముందు పట్టించుకోలేదు. అయితే నా ఫొటోలను మార్ఫింగ్ చేసి ఏకంగా నా కుటుంబ సభ్యులతో నా స్నేహితులకు, సెలబ్రిటీలకు కూడా షేర్ చేశారని తెలుసుకుని చాలా బాధపడ్డాను. ఆపై ఎలాంటి ఆధారాలు లేకుండానే నా గురించి తప్పుడు సమాచారం వైరల్ చేస్తున్నారు. వాటిని చూసి ఎవరో కావాలనే టార్గెట్ చేసి చేస్తున్నారని తెలుసుకున్నాను. ఒకే వ్యక్తి చాలా అకౌంట్లతో ఈ సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తెలిసింది. నేను ఏదైనా పోస్ట్ పెట్టినా తప్పుడు కామెంట్లు చేస్తున్నారు. అందుకే నేను కేరళ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాను.

వాళ్ళు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చెపట్టారు. అందులో నిజాలు బయటకు వచ్చాయి. ఇదంతా చేసింది తమిళనాడులో ఓ 20 ఏళ్ల యువతి అని తెలిసి షాక్ అయ్యాను. తన భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఆమె వివరాలను ప్రపంచానికి చెప్పదలుచుకోలేదు. చట్టం తన పని తాను చూసుకుంటుందని వదిలేస్తున్నాను. యువత మేలుకోవాలనే ఈ విషయాన్ని చెబుతున్నా. చేతిలో ఫోన్, ఉందని సోషల్ మీడియా అకౌంట్ ఉందని ఒకరి పరువు తీసే హక్కు మీకు లేదు. ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలి. చట్టం అందరికీ సమానమే"అని రాసుకొచ్చింది. దీంతో ఈ విషయం తెలిసి యువతులు భయపడిపోతున్నారు.

# ఆర్‌ఎక్స్ 100 డైరెక్టర్‌తో సూపర్ స్టార్ మనవడు



మూవీ న్యూస్, 09 నవంబర్ (కెరటం న్యూస్): సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుండి మరొకరు నటుడిగా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు గట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయం కాబోతున్నాడంటూ చాలా కాలంగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. కాగా తాజాగా దానిపై అఫీషియల్ అప్డేట్ వచ్చేసింది. ఆర్‌ఎక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వం జయకృష్ణ సినిమాను అధికారికంగా ప్రకటించారు. అశ్విని దత్ వైజయంతి మూవీస్ ఈ సినిమాను ప్రెసెంట్ చేస్తుండగా చందమామ కథలు బ్యానర్ పై పి. కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు.

కృష్ణతో అశ్విని దత్ అగ్నిపర్వతం లాంటి బ్లాక్ బస్టర్ సినిమాను తెరెక్కించారు. అంతే కాకుండా మహేశ్ బాబును ఆయనే ఇండస్ట్రీకి పరిచయం చేశాడు. ఇప్పుడు జయకృష్ణ కూడా అదే బ్యానర్ తో ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నాడు. తాజాగా చిత్రయూనిట్ సినిమా అనౌన్సింగ్ పోస్టర్ ను విడుదల చేసింది. పోస్టర్ లో బ్యాగ్రౌండ్ లో తిరుమల ఆలయం కొండలు కనిపిస్తున్నాయి. ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నట్టు చిత్రయూనిట్ ప్రకటించింది. మరి ఈ సినిమా ఎలా ఉంటుందో చూడాలి.

# నేలరాలిన ఎర్రమందారం

## తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ ఇకలేరు

వనం నాగయ్య, కెరటం న్యూస్ బ్యూరో

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ గడ్డపై జరిగిన వీరోచిత సమరంలో తన భర్తను నిలపడమే కాకుండా తానుకూడా తెలంగాణ విముక్తికోసం..నిరంకుశ నిజాం రజాకార్ల ఆగడాలను నిలువరించడంలో శక్తియుక్తులతో ఎదురొడ్డి నిలిచి తెలంగాణ విముక్తి కోసం పోరాడిన ఎర్రజెండా ముద్దుబిడ్డ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ ఇక లేరు. దేశానికి తెల్లవాళ్ల నుండి స్వాతంత్ర్యం సిద్ధించినా తెలంగాణకు దక్కని స్వాతంత్ర్యం కోసం తెలంగాణ బిడ్డలపై జరుగుతున్న నిరంకుశ దాడులను నాగులవంచ కేంద్రంగా ఖమ్మం జిల్లాలో జరిగిన అనేక పోరాటాలకు



వంకాయలపాటి సుగుణమ్మ, ఆమె భర్తది వెన్నుచూపని పోరాట చరిత్ర. ఇంతటి చరిత్ర కలిగిన వంకాయలపాటి సుగుణమ్మం ఆ నాడు కమ్యూనిస్టు కార్యకర్తలకు వేలాది మందికి వంటచేసి పెట్టి ఉద్యమంలో కదిలేలా సేవలు అందించారు. తన ఇల్లే కమ్యూనిస్టు కార్యకర్తలకు ఆఫీసులా మార్చి బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం, ముదిగొండ మండలాల సరిహద్దుల్లో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చేసిన సేవలను తలుచుకుని అనేక మంది నివాళులు అర్పిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ (92) ఆదివారం సాయంత్రంనాగులవంచలో తుదిశ్వాస విడిచారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన సుగుణమ్మ భర్త వంకాయలపాటి సీతయ్య సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పనిచేశారు. సుగుణమ్మ రెండు సార్లు ఖమ్మం సమితి సభ్యురాలిగా, నాగులవంచ గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్ గా ఎన్నికయ్యారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ –సభ్యురాలిగా సుగుణమ్మ కొనసాగారు. సుగుణమ్మ జాతీయ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకురాలిగా రెండు దశాబ్దాల కాలం పాటు వివిధ హోదాలలో పని చేశారు. ఆమె కుమారుడు వంకాయలపాటి సత్యనారాయణ సిపిఐ నుంచి నాగులవంచ 2 ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి –సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ సుగుణమ్మ మృతి పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని వారు తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి సుగుణమ్మ మృతదేహాన్ని సందర్శించి అరుణ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, మండల నాయకులు తాళ్లూరి యాదగిరి, బైరబోయిన హన్మంతరావు, జర్నలిస్టులు వనం నాగయ్య, చావ అరుణ్ కుమార్, ఆదర్శ స్కూల్ కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్, బిఆర్ఎస్ నాయకులు పాపినేని రంగారావు, కొల్లి బాబు, సామినేని బాబురావు, వంకాయలపాటి లచ్చయ్య, అంబటి సైదేశ్వరావు, వెంకటి, పరిటాల లక్ష్మణ స్వామి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సామినేని అప్పారావు, ఆలస్యం రవి, తోటకురి వెంకటనరసయ్య, కందరబోయిన కొండలరావు, మత్కపల్లి మార్కెట్ కమిట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య , బిజెపి నాయకులు కొండా గోపి, మద్దినేని వెంకటేశ్వర్లు , టీడీపీ నాయకులు తేలుకుంట్ల శ్రీనివాసరావు

### ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించేంత వరకూ

# విస్తృత పోరాటాలు

## ఆదివాసి 9 తెగల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ

వనం నాగయ్య, కెరటం న్యూస్ బ్యూరో

ఎస్టీ జాబితా నుండి వలస లంబాడీలను తొలగించడమే లక్ష్యంగా విస్తృత ఉద్యమాలు నిర్వహించనున్నట్లు ఆదివాసి 9 తెగల కార్యచరణ సమితి చైర్మన్ చుంచు రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం బల్లేపల్లి లోని జేఏసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించేంతవరకు జేఏసీ జెండా, ఎజెండా ఒకటేనన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15న చలో అచ్చంపేట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెంచు తెగల సహకారంతో ర్యాలీ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఈ నెల 23న మహబూబాబాద్ జిల్లా గుంజేడులో, 30న ఇల్లందు బొగ్గుట్టలో, డిసెంబర్ 4న చిరుమళ్ళలో విస్తృత సన్నాహక సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 9న ఆసిఫాబాదులో జరిగే బహిరంగ సభకు రాజకీయాలకతీతంగా ఆదివాసీలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... మైదాన ప్రాంత సమాజాన్ని పక్కదోవ పట్టించేందుకు పలువురు దుర్మార్గంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. లంబాడీల కుట్రలను తిప్పికొడతామన్నారు. అనంతరం చలో అచ్చంపేట, బొగ్గుట్ట, చిరుమళ్ళ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆధార్ సొసైటీ అధ్యక్షులు కల్తీ వీరమల్లు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు కొట్నాక విజయ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధ బోయిన లక్ష్మీనారాయణ, ఆదివాసి మహిళా చైతన్య శక్తి చైర్మన్ పూసం వెంకటలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులు కురసం పద్మజ, ఆర్టిఐ డేటా కమిటీ చైర్మన్ బట్టు వెంకటేశ్వర్లు, నల్లమల్ల చెంచుల ప్రతినిధి కాట్రాజు శ్రీను, జేఏసీ నాయకులు కుర్సం సీతారాములు, ముక్తి భాస్కరరావు, చిగుర్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసి 9 తెగల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ